నమస్తే తెలంగాణ
నిజామాబాద్
3 | నిజామాబాద్, శుక్రవారం 31 మే 2024 | NIZAMABAD

ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారు..

తెలంగాణ రాష్ట్ర గేయాన్ని మార్చాల్సిన అవసరం ఎందుకు వచ్చింది. రాష్ట్ర అధికారిక చిహ్నాలను, గేయాన్ని మారుస్తామంటూ తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. తెలంగాణ చరిత్ర తెలియని నీకు చిహ్నాలను మార్చే అధికారం ఎవరు ఇచ్చారు. ఇప్పటి వరకు రైతులకు రైతు బంధు ఇవ్వలేదు, బోనస్ ఇవ్వలేదు ఇలాంటి సమస్యలు పరిష్కరించాల్సింది పోయి.. తెలంగాణ చరిత్రను రూపుమాపే పని పెట్టుకున్నావా?

- రవిచందర్, ఉద్యమకారుడు

చిహ్నాల గురించి నీకేం తెలుసు?

తెలంగాణ చరిత్ర తెలియని సీఎం రేవంత్ రెడ్డి.. అధికారిక చిహ్నాలను ముట్టుకునే అర్హత లేదు. ముందు చరిత్ర తెలుసుకో. ప్రజా సంక్షేమం పై, పాలన మీద దృష్టి పెట్టకుండా...తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని కుట్ర పన్నుతున్నారు. కాకతీయుల కళాతోరణం, చార్మినార్ గుర్తులను అధికారముద్ర నుంచి తీసేయాలనుకోవడం సీఎం రేవంత్‌రెడ్డి మూర్ఖత్వానికి నిదర్శనం.

- చామకూర ప్రభాకర్‌రెడ్డి, ఉద్యమకారుడు

చిహ్నాలను తొలగిస్తే..
పోరాటమే

- నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి
- మండిపడుతున్న తెలంగాణ ఉద్యమకారులు, న్యాయవాదులు, ప్రజానీకం

తెలంగాణ వారసత్వ చిహ్నాలైన కాకతీయ కళాతోరణం, చార్మినార్‌లను రాష్ట్ర అధికార ముద్ర నుంచి తొలగిస్తామన్న కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో ఆగ్రహ జ్వాలలు మొదలవుతున్నాయి. ప్రజలు, ఉద్యమకారులు, న్యాయవాదులు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. తెలంగాణ చరిత్ర తెలుసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, అస్థిత్వ చిహ్నాలుగా ఉన్న కళాతోరణం, చార్మినార్‌ను రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ముద్ర నుంచి తొలగించాలన్న కాంగ్రెస్ సర్కారు సాంస్కృతిక, వారసత్వ సంపదపై దాడిగా చూస్తామని స్పష్టం చేస్తున్నారు. ఉమ్మడి పాలకుల తీరుగానే ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తే మరోసారి తెలంగాణ ఉద్యమ తరహాలో పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు కుట్రలను అడ్డుకునేందుకు ఎంత వరకైనా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని నినదిస్తున్నారు.

– ఖలీల్‌వాడీ, మే 30

మరో ఉద్యమం మొదలవుతుంది

తెలంగాణలో మళ్లీ ఉద్యమం మొదలు కాబోతున్నది. ప్రస్తుత ముఖ్యమంత్రి తెలంగాణ చరిత్రను చదువుకోవాలి. నీ ఇష్టం వచ్చినట్లు చిహ్నాలను మార్చుకుంటూ పోతే ఊరుకునేది లేదు. తెలంగాణ అమరవీరుల సాక్షిగా తెలంగాణ చరిత్ర గర్వపడేలా రాష్ట్ర అధికారిక ముద్రను తయారు చేశారు. రాజకీయంగా ప్రజలకు ఎలా మంచి చేయాలో చూడాలి. కానీ నువ్వు చేసే పనులకు తెలంగాణ కిందామీదా పడుతున్నది. తెలంగాణను నవ్వులపాలు చెయ్యకు రేవంత్ రెడ్డి.

-సత్యప్రకాశ్, ఉద్యమకారుడు

సీఎం ఎప్పుడైనా జై తెలంగాణ అన్నాడా?

తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా, తెలంగాణ చరిత్ర అందరికీ తెలిసేలా ఉన్న చిహ్నాలను మార్చి ఏం పెట్టదలుచుకున్నావ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. సీఎం అయ్యి ఆరు నెలలవుతున్నది. ఏ సభలోనైనా, సమావేశంలోనైనా ఇప్పటి వరకు జై తెలంగాణ అని అన్నావా?. నీకు తెలంగాణ గురించి మాట్లాడే హక్కు లేదు. జై తెలంగాణ అంటే మీ ఆంధ్రా నాయకులు ఒప్పుకోవడం లేదా? తెలంగాణ చిహ్నాలను ముట్టుకుంటే ఊరుకునేది లేదు.

- దాదన్నగారి మధుసూదన్‌రావు, ఉద్యమకారుడు(న్యాయవాది)

ఉద్యమ రుచి చూపిస్తాం..

తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లిన చరిత్ర ఉద్యమకారులది. తెలంగాణ కోసం ప్రాణాలని పణంగా పెట్టిన మా అమరవీరుల సాక్షిగా పుట్టిన చిహ్నాలు కాకతీయుల కళాతోరణం, చార్మినార్‌ను ముట్టుకుంటే ఉద్యమం అంటే ఏంటో చూపిస్తాం. గేయాన్ని మార్చడానికి మీకు ఎవ్వ రూ దొరకలేదా? అదేమైనా రాజకీయ గీతమా? అధికారం వచ్చిన ప్రభుత్వం మార్చడానికి. నీ ఇష్టం వచ్చినట్లు చేస్తున్నావ్. ఇది ఆంధ్రా కాదు.. తెలంగాణ అనే విషయాన్ని మర్చిపోవద్దు. నిన్ను గెలిపించిన తెలంగాణ ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు.

- శ్రీనివాస్‌గౌడ్, ఉద్యమకారుడు

చిన్నారిపై సవతి తండ్రి కర్కశత్వం

గొంతు నులిమి దారుణ హత్య

లక్కీ మృతదేహం

మాక్లూర్, మే 30: నాలుగేండ్ల చిన్నారిని గొంతు నులిమి హత్యచేశాడో కిరాతకుడు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ధర్మోరాలో ఈ హృదయవిదారక ఘటన గురువారం చోటు చేసుకున్నది. ఎస్సై సుధీర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మోరాకు చెందిన ఈర్నాల అరుణ్, నిజామాబాద్‌కు చెందిన సునీతను ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. అప్పటికే సునీతకు పెళ్లయి, బిడ్డ కూడా ఉంది. ఆమెను వివాహం చేసుకున్న అరుణ్.. సునీతతో పాటు కూతురు లక్కీ(4)ని కూడా తీసుకెళ్లాడు. అయితే, మొదటి భర్తకు జన్మించిన పాపపై ఇష్టం లేని అరుణ్.. బిడ్డ ఇంట్లో ఉండొద్దని తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం లక్కీని కొట్టి చేయి విరిచేశాడు. అప్పటి నుంచి సునీత పాపను నిజామాబాద్‌లో ఉండే తల్లి గారింటికి పంపించేసింది. అయితే, బుధవారం తన కూతుర్ని చూడాలని భర్తను కోరగా, అతడు నిజామాబాద్ వెళ్లి పాపను ధర్మోరాకు తీసుకొచ్చాడు. రాత్రి లక్కీ నిద్రిస్తుండగా, సునీత స్నానానికి వెళ్లింది. దీంతో అరుణ్ నిద్రలో ఉన్న పాప గొంతు నులిమి హత్య చేశాడు. సమాచారం అందుకున్న నార్త్ రూరల్ సీఐ సతీశ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని నిజామాబాద్ దవాఖానకు తరలించిన పోలీసులు.. తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

జూన్ 3 నుంచి బడిబాట

కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మే 30: బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు జూన్ 3 నుంచి 11 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నామని, అందులో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బడిబాటలో భాగంగా రోజువారీ చేపట్టనున్న కార్యక్రమాలపై ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 3 చేపట్టే బడిబాటలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తహసీల్దార్లు, ఎంపీపీలు, ఎంపీవోలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని అన్నారు. జూన్ 3న విలేజ్ ఆర్గనైజర్లతో సమావేశం, 4న ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలను గుర్తించడం, 5 నుంచి 10 వరకు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తల్లిదండ్రుల్లో చదువుపై అవగాహన కల్పించి పిల్లలను బడికి పంపించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 11న గ్రామసభ ఏర్పాటు చేసి 3 నుంచి 10 వరకు చేపట్టిన కార్యక్రమాలపై చర్చించాలన్నారు. 12న పండుగ వాతావరణంలో పాఠశాలలను పునఃప్రారంభించి నూతన విద్యార్థులకు స్వాగతం పలకాలన్నారు. 13న తొలిమెట్టు, 14న సామూహిక అక్షరాభ్యాసం,15న గర్ల్ చైల్డ్ ఎడ్యుకేషన్, 18న డిజిటల్ తరగతులపై అవగాహన, 19న ఆటల పోటీలు నిర్వహించాలన్నారు. డీఈవో రాజు, నీలం లింగం, పంచాయతీ రాజ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

కామారెడ్డి,మే 30: జూన్ 9న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై ఎస్పీ సింధూశర్మ, ట్రైనీ ఏఎస్పీ కాజల్ సింగ్‌లతో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4,797మంది అభ్యర్థులు 12 కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారని అన్నారు. పరీక్షలు సాఫీగా నిర్వహించేందుకు నియమించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, రూట్ అధికారులు ముందుగా ఆయా కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. సెంటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తూ జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని అన్నారు. ఐడెంటిఫికేషన్ అధికారులు ఉదయం 9 నుంచి అభ్యర్థులను చెక్ చేస్తూ పరీక్షా కేంద్రాలకు 10 గంటల వరకు అనుమతించాలని, ఆ తర్వాత ఎవరినీ అనుమతించొద్దని సూచించారు. సమావేశంలో ఆర్డీవో రంగనాథరావు, డీఈవో రాజు, నీలం లింగం,ఆర్‌టీఏ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిర, విద్యుత్, మున్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సీ ప్రాక్టికల్స్ పరీక్షల షెడ్యూల్ విడుదల

డిచ్‌పల్లి, మే 30 : టీయూ పరిధిలో బీఎస్సీ 2, 4, 6వ సెమిస్టర్ (రెగ్యులర్) ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్‌ను గురువారం విడుదల చేశారు. గ్రూప్-ఏ కళాశాలల్లో జూన్ 22 నుంచి 23వ తేదీ వరకు, గ్రూప్-బీ కళాశాలల్లో జూన్ 29 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారిణి అరుణ తెలిపారు. మార్కులను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు తెలంగాణ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గురుకుల కళాశాలల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, మే 30 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆర్సీవో అలివేలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ, వొకేషనల్ గ్రూపుల్లో చేరేందుకు 2024 మార్చి ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సైలెన్స్

భారీ శబ్దం చేసే బైక్ సైలెన్సర్లపై నిజామాబాద్ పోలీసులు కొరడా ఝుళిపించారు. సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ ఆదేశాలతో ఆర్టీఏ అధికారులతో కలిసి గురువారం జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం చేసే సైలెన్సర్లను బిగించి నడుపుతున్న వాహనాలను పట్టుకున్నారు. దాదాపు 122కి పైగా వాహనాలను గుర్తించి వాటి సైలెన్సర్లను మళ్లీ వినియోగించకుండా చేశారు. నగరంలోని ధర్నా చౌక్ వద్ద రోడ్ రోలర్ సహాయంతో ట్రాఫిక్ పోలీసులు సైలెన్సర్లను ధ్వంసం చేశారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, జిల్లా రవాణాశాఖ అధికారి ఉమా మహేశ్వర్‌రావు, ఏసీపీ శేషాద్రి రెడ్డి, ట్రైనీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ ఉన్నారు.

– వినాయక్‌నగర్, మే 30

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

అదనపు కలెక్టర్ అంకిత్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

కంఠేశ్వర్, మే 30: చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై కఠినచర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ అంకిత్ తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌నకు సంబంధించి జిల్లా కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 151 స్కానింగ్ సెంటర్లు ఉంటే 125 మాత్రమే పనిచేస్తున్నాయని, వీటన్నింటికీ రిజిస్ట్రేషన్లు రెన్యువల్ చేసుకోవాలని, స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ చేయొద్దని తెలిపారు. అర్హులైన సిబ్బందినే నియమించుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ మాట్లాడుతూ గత 25న జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం నిర్వహించగా స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు 3 దరఖాస్తులు వచ్చాయని, రిజిస్ట్రేషన్ రెన్యువల్‌కు 11, సెంటర్ల రద్దు కోసం 3 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖతో కలిసి మండలాల్లో విస్తృతంగా అవగాహన కల్పించామన్నారు. సమావేశంలో ఏసీపీ ఎల్ రాజావెంకటరెడ్డి, సీడీపీవోలు స్వర్ణలత, నందిని, లయన్స్ క్లబ్ ఇందూరు అధ్యక్షుడు విజయానంద్, జ్యుడీషియరి సూపరింటెండెంట్ సయ్యద్ ఇర్షాద్ బుకారి తదితరులు పాల్గొన్నారు.

బలహీనతను.. ఆసరా చేసుకొని

- బయటికొస్తున్న స్కానింగ్ సెంటర్ నిందితుడి లీలలు
- వెలుగులోకి మరిన్ని విషయాలు

ఖలీల్‌వాడి, మే 30: స్కానింగ్ ముసుగులో మహిళల వీడియోలు చిత్రీకరిస్తూ పోలీసులకు చిక్కిన నిందితుడి లీలలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. స్కానింగ్ కోసం వచ్చే మహిళలను టార్గెట్ చేసిన నిందితుడు ప్రశాంత్.. అమాయకులతో ఆడుకున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. కొంత మంది మహిళల బలహీనతను ఆసరాగా చేసుకొని స్కానింగ్ పేరిట వారికి ఏవేవో ఆశలు చూపి తన వలలో వేసుకున్నట్లు తెలిసింది. లింగ నిర్ధారణ పేరిట మరికొందరికి స్కానింగ్ చేస్తూ వారి ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు సమాచారం. కొందరు మహిళలు లింగ నిర్ధారణ చేయడం నేరమని తెలిసినా...ఇంట్లో వేధింపులు తదితర ఇబ్బందుల దృష్ట్యా లింగ నిర్ధారణ చేయించుకుంటున్నారు. ఇదే అదనుగా తీసుకున్న ప్రశాంత్ తమ స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ చేస్తామని ఆశ చూపి.. స్కానింగ్‌కు వచ్చిన మహిళ ఫొటోలు, వీడియోలు తీసి మొబైల్‌కు పంపించేవాడని తెలిసింది. తనకు డబ్బులు ఇవ్వాలని, సన్నిహితంగా ఉండాలని లేకపోతే తాను తీసిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించేవాడని సమాచారం. దీంతో బాధిత మహిళలు కాళ్ల మీద పడి ప్రాధేయపడేవారు. మరికొందరు డబ్బులు ఇచ్చి తమను ఇబ్బందులకు గురిచేయొద్దని చేతులెత్తి మొక్కారు. అయినా మహిళలను వదలకుండా తీవ్ర మనోవేదనకు గురిచేసే వాడని సమాచారం.

కమీషన్ కోసం ఇదే సెంటర్‌కి రిఫర్..

జిల్లాలో ఎన్నో స్కానింగ్ సెంటర్లు ఉన్నా ఈ ఒక్క స్కానింగ్ సెంటర్‌కు ఎక్కువ సంఖ్యలో మహిళలు వస్తుంటారు. ఇందుకు ప్రధాన కారణం యాజమాన్యం అందించే కమీషన్. పెద్ద మొత్తంలో కమీషన్ వస్తుండడంతో ఆర్ఎంపీ నుంచి బడా డాక్టర్ల వరకు మహిళలను ఇక్కడికే రిఫర్ చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఈ స్కానింగ్ సెంటర్‌లోనే స్కానింగ్ తీసుకోవడం ద్వారా సమస్యను పూర్తిగా విశ్లేషించవచ్చనే భ్రమ కల్పించడంతో చేసేదేమీ లేక ఇక్కడే స్కానింగ్ చేయించుకునేవారని సమాచారం. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో బలహీనత అనుకోవచ్చు. ఇవన్నింటినీ ఆసరాగా చేసుకున్న నిందితుడు ప్రశాంత్.. అమాయక మహిళలకు వేధించినట్లు తెలుస్తున్నది.

దేవుడా మన్నించు..

దేవుడి పేరుతో నెలకొల్పిన స్కానింగ్ సెంటర్‌లో మహిళల జీవితాలతో చెలగాటమాడే వీడియోలు, ఫొటోలు తీయడంపై సభ్యసమాజం దుమ్మెత్తి పోస్తున్నది. స్కానింగ్ పేరిట మహిళలను దుస్తులు లేకుం డా చేసి ఫొటోలు, వీడియోలు తీయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. నిందితుడి మొబైల్ డాటా రికవరీతో ఈ తతంగం కొన్నేండ్లుగా సాగుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదంతా ఒక్కడే ఎలా చేస్తాడని, ఎవరైనా సహకరించి ఉంటారనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు సమాచారం.